వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
బుధవారం, అక్టోబర్ 21, 2026

ఉప్పల్‌లో ఘనంగా రావణ దహన వేడుకలు..

- పాల్గొన్న టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ దంపతులు
- చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
- భారీ సంఖ్యలో తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక ప్రజలు



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : దసరా పండుగను పురస్కరించుకుని ఉప్పల్ నియోజకవర్గంలో నిర్వహించిన రావణ దహన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రావణుడి ప్రతిమకు నిప్పంటించి రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉప్పల్ నియోజకవర్గ నాయకులు పరమేశ్వర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు వజ్రేశ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ రజిత, కాంగ్రెస్ నాయకులు భూపతిరెడ్డి, నర్సారెడ్డి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తెలంగాణ ప్రజలందరికీ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ మానవాళికి ఒక అద్భుతమైన హితాన్ని, స్ఫూర్తిని అందించే పండుగ అని పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దేశవ్యాప్తంగా ప్రజలు ఈ పండుగను ఎంతో ఘనంగా జరుపుకుంటారని అన్నారు. భగవంతుని దయతో రాష్ట్ర ప్రజల అందరి జీవితాల్లోనూ మంచి జరగాలని, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. ఉప్పల్‌లో నిర్వహించిన ఈ రావణ దహన వేడుకల వద్ద ప్రజలు భారీగా గుమికూడటంతో పండుగ వాతావరణం నెలకొంది.





రైతులకు వెంటనే సాగునీరు అందించాలి

- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్
- ఎల్ 34, ఎల్ 35 లిఫ్టల ద్వారా నీటిని విడుదల చేయాలి
- జల వనరుల శాఖ కార్యాలయం వద్ద ధర్నా
- పట్టభద్రులందరూ ఓటరుగా నమోదై కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపు



కోదాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : కోదాడ నియోజకవర్గం నడిగూడెం మండలంలోని ఎల్34, ఎల్35 ఎత్తిపోతల (లిఫ్ట్) పథకాల ద్వారా వెంటనే రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో రైతులు జల వనరుల శాఖ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, అధికారులు తక్షణమే స్పందించి రైతులకు నీరందించి ఆదుకోవాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర సాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారని, అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సాగునీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వారికి తగిన న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఉన్న ప్రతి పట్టభద్రుడిని ఫారం-18 ద్వారా ఓటరుగా నమోదు చేయించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఓట్ల నమోదును వేగవంతం చేసి, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతు నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జవహర్ నగర్ డంప్ యార్డు తరలించాలి

- ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్ర
- మీథేన్ గ్యాస్ ఉద్గారాల్లో ప్రపంచంలోనే 4వ స్థానంలో జవహర్ నగర్ డంప్ యార్డు
- ఈ నెల 27 నుంచి పాదయాత్ర..
- 23న బాధితులతో భేటీ,
- 25న మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం
- చెత్త నిర్వహణ సాంకేతికత అందుబాటులో ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపాటు



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : జవహర్ నగర్ డంప్ యార్డు వల్ల చుట్టుపక్కల నివసించే లక్షలాది మంది ప్రజల జీవితాలు విషతుల్యమవుతున్నాయని, తక్షణమే ఈ డంప్ యార్డును జనావాసాలకు దూరంగా తరలించాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్రకు శ్రీకారం చుడుతున్నారు. చెత్త నిర్వహణపై అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని వినియోగించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జవహర్ నగర్ డంప్ యార్డు బాధితులకు న్యాయం చేకూరే వరకు సుదీర్ఘ పోరాటం చేస్తామని స్పష్టం చేసిన ఆయన, కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. ఈ నెల 23న జవహర్ నగర్ బాధితులతో స్థానికంగా సమావేశం, ఈ నెల 25న డంప్ యార్డు ప్రాంతంలోనే మేధావులు, పర్యావరణ వేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశం, ఈ నెల 27 నుంచి డంప్ యార్డుకు వ్యతిరేకంగా భారీ పాదయాత్ర చేపడతానని తెలిపారు. గ్లోబల్ వార్మింగ్‌కు, తీవ్ర వాతావరణ మార్పులకు ప్రధాన కారణమైన మీథేన్ గ్యాస్ విడుదల చేయడంలో జవహర్ నగర్ డంప్ యార్డు ప్రపంచంలోనే 4వ స్థానంలో నిలిచి 'చెత్త రికార్డు' మూటగట్టుకుందని ఎంపీ ఈటల ఆందోళన వ్యక్తం చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు దీనిపై అధ్యయనం చేసి తనకు నివేదించిన వివరాలను ఆయన పంచుకున్నారు. యూసీఎల్ఏ లా స్కూల్ (యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, లాస్ ఏంజెల్స్) ఉపగ్రహాల సహాయంతో సర్వే చేసి 18 దేశాల్లో అత్యధికంగా మీథేన్ విడుదల చేస్తున్న మొదటి 25 ప్రాంతాల జాబితాను ప్రకటించింది. ఈ నివేదిక ప్రకారం మొదటి స్థానం: బ్యూనస్ ఐరిస్ (అర్జెంటీనా), రెండవ స్థానం: జకార్తా (ఇండోనేషియా), మూడవ స్థానం: కౌలాలంపూర్ (మలేషియా), నాలుగో స్థానం: జవహర్ నగర్ డంప్ యార్డు (హైదరాబాద్, భారతదేశం) ఉన్నాయి. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. "జవహర్ నగర్ డంప్ యార్డును మొదట్లో 2 లక్షల జనాభా చెత్త కోసం ఏర్పాటు చేశారు. కానీ నేడు దాదాపు కోటి 60 లక్షల మందికి సంబంధించిన చెత్తను ఇక్కడకు తెచ్చి పడేస్తున్నారు. డంప్ యార్డు చుట్టూ 25 కిలోమీటర్ల పరిధిలో భూగర్భ జలాలు పూర్తిగా విషతుల్యమయ్యాయి. 30 కిలోమీటర్ల రేడియస్‌లో నివసిస్తున్న ప్రజలు విషపు గాలులను పీల్చుతూ ఊపిరితిత్తుల సమస్యలు, తీవ్రమైన చర్మ వ్యాధుల బారిన పడుతున్నారు. కడు పేదరికంలో ఉంటూ కూరగాయలు అమ్ముకుని, ఇళ్లలో పనిచేసుకునే నిరుపేదలు తాము సంపాదించే ప్రతి పైసాను ఆస్పత్రి ఖర్చులకే వెచ్చించాల్సిన దుస్థితి ఏర్పడింది" అని వాపోయారు.

• శాశ్వత పరిష్కారం చూపాలి

ఇంత సాంకేతికత పెరిగిన కాలంలో కూడా చెత్త వల్ల ప్రజలు ఇన్ని ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే దుర్మార్గమైన పరిస్థితికి స్వస్తి పలకాలని ఈటల డిమాండ్ చేశారు. ఐఐటీ బొంబాయి వారు చెత్త నిర్వహణకు తగిన టెక్నాలజీని అందించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేయడం తప్ప సమస్యకు ఆచరణాత్మక పరిష్కారం చూపలేకపోయారని మండిపడ్డారు. ప్రగల్భాలు పక్కనపెట్టి సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే ఈ సమస్యపై దృష్టి సారించి జవహర్ నగర్ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. నగరానికి నాలుగు దిక్కులా చెత్తను పంపిణీ చేస్తూ, జీరో పొల్యూషన్ దిశగా అడుగులు వేయాలని హితవు పలికారు.

మంత్రి సీతక్కను కలిసిన టీజేపీ ములుగు జిల్లా నూతన కమిటీ

- శాలువాలతో సన్మానించి అభినందించిన మంత్రి
- జర్నలిస్టుల సంక్షేమానికి సహకారం అందిస్తా
- జర్నలిస్టులకు మంత్రి సీతక్క భరోసా



ములుగు, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) ములుగు జిల్లా నూతన కార్యవర్గ కమిటీ సభ్యులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను ములుగులోని ఆమె క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన టీజేఏ జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులను మంత్రి శాలువాలతో సన్మానించి, ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. సమాజంలో జర్నలిస్టులు ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలుస్తూ ప్రజల గొంతుకగా పనిచేస్తున్నారని కొనియాడారు. ములుగు జిల్లాలోని అన్ని పాత్రికేయ యూనియన్లతో మమేకమై పనిచేస్తూ, జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడాలని నూతన కమిటీకి సూచించారు. తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆమె భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని మంత్రి తెలిపారు. జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు ఆరోగ్య బీమా, ఇళ్ల స్థలాల కేటాయింపుతో పాటు ఇతర సంక్షేమ పథకాలు అమలయ్యేలా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే జిల్లాలో మీడియా రంగాభివృద్ధికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామన్నారు. తమ విన్నపాలు మరియు సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్కకు టీజేఏ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజేఏ ములుగు జిల్లా కార్యవర్గ సభ్యులు, పలువురు విలేకరులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్

VOICE OF
VANDE BHARATH

బుధవారం, అక్టోబర్ 21, 2026

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో నలమాస శ్రీకాంత్ గౌడ్

- తెలంగాణ రక్షణ సేన అభ్యర్థిగా ప్రకటన చేసిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత
- దసరా శుభ ముహూర్తాన తొలి అభ్యర్థి ఖరారు
- ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా సయ్యద్ ఇస్మాయిల్ నియామకం



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : రాబోయే వరంగల్ – ఖమ్మం – నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి 'తెలంగాణ రక్షణ సేన' తమ మొదటి అభ్యర్థిని ప్రకటించింది. తెలంగాణ ఉద్యమకారుడు, పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను పార్టీ అభ్యర్థిగా ఖరారు చేస్తున్నట్లు పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత వెల్లడించారు. విజయదశమి పండుగ శుభ ముహూర్తాన్ని పురస్కరించుకుని పార్టీ తరపున ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే తొలి అభ్యర్థి పేరును ఆమె అధికారికంగా ప్రకటించారు. అలాగే ఈ ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయం కోసం స్టేట్ పార్టీ అబ్జర్వర్‌గా పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ ఇస్మాయిల్‌ను నియమించినట్లు తెలిపారు. డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ ఉమ్మడి వరంగల్ (ప్రస్తుత మహబూబాబాద్) జిల్లా నర్సింహులపేట మండలం కౌసల్యాదేవి పల్లి గ్రామానికి చెందినవారు. ఆయన ప్రసిద్ధ కాకతీయ యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డీ పట్టా పొందారు. మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించారు. తెలంగాణ జాగృతి ప్రారంభం నుంచి కల్వకుంట్ల కవితకు నమ్మకస్తుడిగా, వెన్నంటి నిలిచిన శ్రీకాంత్ గౌడ్.. పార్టీ ఆవిర్భావం అనంతరం అధికార ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టారు. టీవీ ఛానళ్ల చర్చల్లో, ప్రజా సంఘాల వేదికలపై పార్టీ భావజాలాన్ని, ప్రజల సమస్యలను బలంగా వినిపిస్తూ పార్టీ ముఖ్య గొంతుకగా నిలిచారు. టీఆర్ఎస్ స్థాపించిన తర్వాత తొలిసారిగా శాసనమండలి ఎన్నికల బరిలోకి దిగుతుండటంతో ఈ ఎన్నిక రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. గత మూడేళ్లుగా బహుజనుల గొంతుకగా అనేక సామాజిక ఉద్యమాలకు రూపకల్పన చేసిన కల్వకుంట్ల కవిత, అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ తొలి ఎమ్మెల్సీ అభ్యర్థిగా శ్రీకాంత్ గౌడ్‌ను ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

జర్నలిజం నుంచి రాజకీయాల వరకు..

- లోక రవిచంద్రకు కీలక బాధ్యతలు!
- సిద్ధిపేట జిల్లా టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా నియామకం
- మూడు దశాబ్దాల సుదీర్ఘ అనుభవానికి దక్కిన తగిన గుర్తింపు

హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : జర్నలిజంలో దాదాపు మూడు దశాబ్దాల ప్రయాణం, సామాజిక సేవలో ప్రత్యేక ముద్ర, బ్రాహ్మణ పరిషత్తు అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో రాజకీయాల్లో చురుకైన ప్రస్థానం.. ఇలా విభిన్న రంగాల్లో తనదైన గుర్తింపు పొందిన లోక రవిచంద్రకు అత్యంత కీలకమైన బాధ్యతలు వరించాయి. సిద్ధిపేట జిల్లా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షుడిగా ఆయనకు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఆయన నియామకంతో జిల్లా రాజకీయ వర్గాల్లో ఒక్కసారిగా ఆసక్తి నెలకొంది.

మూడు దశాబ్దాల జర్నలిజం ప్రస్థానం

లోక రవిచంద్రకు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా రంగాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. జర్నలిజంలో మండల స్థాయి నుంచి ఎడిటర్ స్థాయి వరకు వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజా సమస్యలు, సామాజిక అంశాలపై లభించిన సునిశిత అవగాహన ఆయన సొంతం. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడం, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన విశేష అనుభవం సంపాదించారు. ఈ సుదీర్ఘ మీడియా అనుభవం ఆయన రాజకీయ ప్రయాణానికి, ప్రజా సంక్షేమానికి ఎంతగానో ఉపయోగపడుతుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

సామాజిక సేవలో తనదైన సంతకం

సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిగా 'సంఘమిత్ర సంక్షేమ సమితి' స్వచ్ఛంద సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. సమాజంలోని నిరుపేదలు, వివిధ వర్గాల సంక్షేమం కోసం చేపట్టిన పలు కార్యక్రమాల ద్వారా తన సేవా నిబద్ధతను చాటుకున్నారు. మరోవైపు, సిద్ధిపేట బ్రాహ్మణ పరిషత్తు అధ్యక్షుడిగా మూడేళ్ల పాటు బాధ్యతలు నిర్వర్తించి, సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేశారు. ముఖ్యంగా బ్రాహ్మణ పరిషత్తు సంక్షేమ సదనం అభివృద్ధి కోసం రూ.75 లక్షల నిధులు మంజూరు చేయించడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. ఈ కృషి ఆయన సమర్థవంతమైన నాయకత్వ పటిమకు నిదర్శనంగా నిలిచింది.



తెలంగాణ జాగృతి నుంచి రాజకీయ అడుగులు

కల్వకుంట్ల కవిత నాయకత్వంలోని తెలంగాణ జాగృతిలో చేరిన లోక రవిచంద్ర, అక్కడ స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అనంతర కాలంలో పార్టీ నిర్మాణం, సిద్ధాంతాల రూపకల్పనతో పాటు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రధాన పాత్ర పోషించారు. పార్టీ నిర్వహించిన జెండా పండుగ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడిగా వ్యవహరించి, అధిష్టానం నమ్మకాన్ని గెలుచుకున్నారు.

జిల్లా రాజకీయాల్లో కొత్త బాధ్యతలు..

సిద్ధిపేట జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న లోక రవిచంద్ర ముందు ఇప్పుడు పలు సవాళ్లు, అవకాశాలు ఉన్నాయి. పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడటం వంటివి ఆయన నాయకత్వానికి ప్రధాన విధులుగా మారనున్నాయి. జర్నలిస్టుగా ప్రజల సమస్యలను పరిశీలించిన అనుభవం, స్వచ్ఛంద సంస్థల ద్వారా చేసిన సామాజిక సేవ ఆయన రాజకీయ ప్రయాణానికి అదనపు బలాన్ని ఇస్తాయని ఆయన మద్దతుదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జర్నలిజం, సామాజిక సేవ, రాజకీయ అనుభవం కలగలిసిన లోక రవిచంద్ర నాయకత్వంలో సిద్ధిపేట జిల్లా రాజకీయాలు ఎలాంటి కొత్త మలుపులు తిరుగుతాయో వేచి చూడాలి.

సంగారెడ్డిలో అంబరాన్నంటిన దసరా సంబురాలు..

- తల్లిదండ్రుల ఆరోగ్యంపై జగ్గారెడ్డి భావోద్వేగ ప్రసంగం
- అంబేద్కర్ స్టేడియంలో ఘనంగా రావణ దహనం, జమ్మి పూజ..
- ఆకట్టుకున్న డ్రోన్ల ప్రదర్శన, సంగీత విభావరి
- దేవుడిని మొక్కే ముందే బీపీ, షుగర్ మందులు వేసుకోవాలి
- కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి

సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ : సంగారెడ్డి పట్టణంలో దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా, అంబరాన్నంటే ఉత్సాహంతో జరిగాయి. ఏటా మాదిరిగానే కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టేడియం వేదికగా నిర్వహించిన దసరా వేడుకలు నగర ప్రజలను ఎంతగానో అలరించాయి. పట్టణంలోని రామమందిరంలో ప్రత్యేక భజన కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రామమందిర భజన మండలి సభ్యులు, భక్తులతో కలిసి జగ్గారెడ్డి భజనలో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయబద్ధంగా శమీ కొమ్మను తీసుకుని రామమందిరం నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు భారీ ఊరేగింపుగా తరలివచ్చారు. అంబేద్కర్ స్టేడియంలో మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో జగ్గారెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు శాస్త్రోక్తంగా జమ్మి పూజ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన రావణ దహన కార్యక్రమం ఉత్సవాలకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆకాశంలో వర్ణరంజితంగా వెలిగిన బాణాసంచా మెరుపులు, ఆకట్టుకునే డ్రోన్ల ప్రదర్శన, ప్రముఖ నేపథ్య గాయకుల సంగీత విభావరి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ సందర్భంగా వేదికపై ప్రజలను ఉద్దేశించి జగ్గారెడ్డి భావోద్వేగంగా మాట్లాడారు. కుటుంబ బంధాలు, పెద్దల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పిలుపునిచ్చారు. ''ప్రతి రోజూ దేవుడిని మొక్కే ముందే బీపీ, షుగర్ ఉన్నవారు వైద్యులు సూచించిన విధంగా సమయానికి మందులు వేసుకోవాలి. ఇంట్లో తల్లిదండ్రులు ఉంటే వారు క్రమం తప్పకుండా మందులు తీసుకునేలా కొడుకులు, కుమార్తెలు, కోడళ్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. వయసు పెరిగేకొద్దీ పెద్దల ఆరోగ్యంపై బాధ్యతగా వ్యవహరించాలి. కాళ్లు, చేతులు పడిపోయిన తర్వాత ఎన్ని కోట్లు ఖర్చు పెట్టినా ప్రయోజనం ఉండదు'' అని ఆయన హితవు పలికారు. పండుగలంటే కేవలం వినోదం మాత్రమే కాదని, కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయతలు పెంపొందించుకునే వేదికలని ఆయన పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ జగ్గారెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. ''నా దగ్గర చాలా డబ్బులు ఉన్నాయని అందరూ అనుకుంటారు. కానీ నాకు వచ్చిన ప్రతి రూపాయిని సంగారెడ్డి ప్రజల కోసం, పండుగలు నిర్వహించడానికి ఖర్చు చేస్తున్నాను. నలభై ఏళ్ల క్రితం చిన్న వయసులో ఇదే మైదానంలో నా స్నేహితులతో కలిసి దసరా వేడుకల్లో పాల్గొన్నాను. నన్ను కౌన్సిలర్ స్థాయి నుంచి ఈ స్థాయికి తీసుకువచ్చింది సంగారెడ్డి ప్రజలే. ఇక్కడి ప్రజలందరూ నా కుటుంబమే. ఈ వేడుకల్లో స్థానిక ప్రజలు, పార్టీ శ్రేణులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయదశమి వేడుకలను విజయవంతం చేశారు.



కృష్ణకాంత్ పార్క్ వద్ద ఘనంగా రావణ దహనం

ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా దసరా వేడుకలు

జూబ్లీహిల్స్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ ఏజీ కాలనీ డివిజన్ పరిధిలోని కృష్ణకాంత్ పార్క్ వద్ద రావణ దహన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. జూబ్లీహిల్స్ శాసనసభ్యులు వి. నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు స్థానిక ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించిన ఈ వేడుకల్లో చిన్నారులు శ్రీరాముడి వేషధారణలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, వారి ప్రదర్శన అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. వారితో పాటు శ్రీశైలం యాదవ్, ఆయన సతీమణి వర్షా యాదవ్, వెంకట్ యాదవ్, పలువురు కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విజయదశమి పర్వదినం సందర్భంగా కృష్ణకాంత్ పార్క్ పరిసర ప్రాంతాలన్నీ ప్రజలతో కిటకిటలాడుతూ పండుగ వాతావరణంతో సందడిగా మారాయి.

